17 నుంచి లారీ యజమానుల నిరవధిక సమ్మె

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ కేసులకు సం బంధించి కేంద్రప్రభుత్వం తాజాగా రూపొందించిన చట్టాలను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 17నుంచి లారీ యజమానులు నిరవధిక సమ్మె నిర్వహించాలని నిర్ణయించారు. ఫెడరేషన్ ఆఫ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సి. నవీన్‌రెడ్డి బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ ట్రక్‌లు, లారీ యజమానులతో చర్చించకుండానే ఏకపక్షంగా ఈ చట్టాలను సిద్ధం చేయడం విచారకరమన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, సురేశ్, మన్సూర్ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

దేవెగౌడ శాపాలే.. మాకు ఆశీర్వాదాలు

- ఆయన సెక్యులర్ కిరీటాన్ని తొలగించారు
- బీజేపీకి బి-టీమ్‌గా నిరూపించారు
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయ గురువు, మాజీ ప్రధాని దేవెగౌడ శాపాలనే తాము ఆశీర్వాదాలుగా స్వీకరిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిద్దరామయ్య, డీకే శివకుమార్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అంతరించిపోనున్నట్టు మాజీ ప్రధాని దేవెగౌడ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ సీఎం పైవిధంగా బదులిచ్చారు. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమని అయితే పెద్దలు చిన్నవారికి సదా ఆశీర్వాదం అందించాలే తప్ప శపించకూడదని హితవు పలికారు. దశాబ్దాలపాటు సెక్యులర్ కిరీటాన్ని ధరించుకుంటూ వచ్చిన దేవెగౌడ తమ అంతిమఘడియల సమీపంలో దాన్ని తీసేసి మతోన్మాద కిరీటాన్ని ధరించారని పేర్కొన్నారు. బీజేపీతో స్నేహం దరిమిలా దేవెగౌడ మాటలతీరు కూడా మారిందని అన్నారు. బీజేపీకి బి-టీమ్‌గా ఉందంటూ జేడీఎస్‌పై ఎన్నికల సమయంలో తాము చేసిన వ్యాఖ్యలు అక్షరాలా నిజమయ్యాయని గుర్తు చేశారు. వీటిని నిజం చేసినందుకు దేవేగౌడకు ధన్యవాదాలు తెలిపారు. ఏ రాజకీయ పార్టీ కూడా మరో రాజకీయ పార్టీ అంతరించిపోవాలని కోరుకోరాదని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ ముక్త భారత్ నిర్మిస్తామని బీజేపీ దశాబ్దాల కాలంగా ప్రచారం చేస్తూనే ఉందని, తమ పార్టీ విజయాలను మాత్రం అడ్డుకోలేకపోయిందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. వీటిని స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాజయాల కారణంగానే నిరాశ, నిస్పృహలతో దేవెగౌడ కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. దేవెగౌడ ఉత్తమ ఆరోగ్యంతో నిండు నూరేళ్ల విలసిల్లాలని, క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగాలని, సదా ప్రతిపక్షంలోనే ఉండాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. జేడీఎస్ తన సెక్యులర్ ముసుగును తీసేయడంతో ప్రజల్లో ఒక స్పష్టత వచ్చిందన్నారు.



ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసిన పోలీసు ఉన్నతాధికారులు

శాంతికి విఘాతం కలిగిస్తే ఉక్కుపాదం: సీఎం

రాష్ట్రంలో అశాంతిని, భయభీత వాతావరణాన్ని సృష్టించేందుకు ఎవరు ప్రయత్నించినా నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలని, ఉక్కుపాదం మోపాలని పోలీసు ఉన్నతాధికారులకు సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. బెంగళూరు నగర పోలీసు ఉన్నతాధికారులు శనివారం ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ జరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బెంగళూరుసహా రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రత్యేకించి మాదకద్రవ్యాల మాఫియాలను అణచివేయాలని సీఎం స్పష్టమైన సూచన చేశారు. బెంగళూరులో అందుబాటులో ఉన్న 241 హొయసళ గస్తీ వాహనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూసిన పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు. బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బి. దయానంద్‌తో పాటు అదనపు పోలీస్ కమిషనర్లు, డీసీపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

కులగణన నివేదికను స్వీకరించాలి

కులగణన నివేదిక స్వీకరించాలని బీసీ కులాలకు చెందిన మఠాధిపతులు శనివారం సీఎం సిద్దరామయ్యకు విజ్ఞప్తి చేశారు. అధికార నివాసం కృష్ణలో మఠాధిపతులు సిద్ధరామేశ్వరస్వామిజీ, ప్రసన్నానందపురిస్వామిజీ, నిరంజనానందపురి స్వామిజీ సారథ్యంలో పలువురు సీఎంను భేటీ అయ్యారు. న్యాయనిపుణులతో చర్చించి దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. బెంగళూరులో శనివారం ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు. కొత్త పెన్షన్ విధానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని వినతిలో పేర్కొన్నారు. ప్రభుత్వ గ్యారెంటీ, సంక్షేమ పథకాలు ప్రజలకు పక్కాగా అందేలా అధికారులు, ఉద్యోగులు సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘాల న్యాయసమ్మతమైన అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

బెంగళూరు దక్షిణలో బలమైన అభ్యర్థి కోసం కాంగ్రెస్ అన్వేషణ

- 46 ఏళ్లలో కాంగ్రెస్ గెలిచింది ఒక్కసారే

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో బీజేపీ కంచుకోటగా ఉన్న బెంగళూరు దక్షిణ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్టీ సిట్టింగ్ ఎంపీ తేజస్విసూర్య మరోసారి బరిలోకి దిగడం ఖాయం కానుంది. ఈ నేపథ్యంలో ఆయనపై బలమైన అ భ్యర్థిని బరిలోకి దించేందుకు కాంగ్రెస్ భారీగానే కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ తరఫున ఇక్కడ పోటీ చేసేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తిచూపడం లేదని సమాచారం. 2019 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ పోటీచేసి ఓడిపోయారు. ఆరు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో జయనగర్ నుంచి పోటీచేసిన మంత్రి రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యారెడ్డి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. జయనగర్ కూడా బెంగళూరు దక్షిణ పరిధిలోనే ఉండటంతో ఆమెను రంగంలోకి దింపేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ కథనాలపై మంత్రి రామలింగారెడ్డిగానీ, ఆయన కుమార్తె మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి గానీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ జేడీఎస్ పోటీచేసింది. ఈసారి బీజేపీతో పొత్తు ఉన్నందున పార్టీ అభ్యర్థి ఉండరని జేడీఎస్ వర్గాలు అంటున్నాయి. ఈ లెక్కన బీజేపీ ఓటు బ్యాంకుతో పాటు జేడీఎస్ ఓటు బ్యాంకు కూడా కలిస్తే తేజస్విసూర్యను ఢీ కొనడం ఒకింత కష్టమేనన్న వాదన వినిపిస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే అంశంపై నియోజకవర్గంలో ఉత్కంఠత నెలకొని ఉంది.

ఒకేసారి..

1977 నుంచి బెంగళూరు దక్షిణ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది ఒక్కసారి మాత్రమే. ప్రతిపక్షాల కంచుకోటగానూ క్రమేపీ బీజేపీ కంచుకోటగానూ ఈ నియోజకవర్గం రూపాంతరం చెందింది. దివంగత కేంద్ర మంత్రి అనంతకుమార్ ఈ నియోజకవర్గానికి 1996 నుంచి 2014 వరకు ఆరుసార్లు జరిగిన ఎన్నికల్లో గెలుపొంది సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించారు. కేంద్ర మంత్రిగా ఉంటూనే ఆయన మృతి చెందారు. 1989లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌పై ఆర్. గుండూరావు గెలుపొందారు. ఆపై జరిగిన అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓటమి పాలవుతూ వస్తోంది.



15 అడుగుల ఉడత విగ్రహం

అయోధ్య రాముడికి ఉడతా భక్తి

- 15 అడుగుల ఉడత విగ్రహాన్ని కానుకగా పంపిన ఇంజనీర్

బెంగళూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈనెల 22న భవ్య రామమందిరం ప్రారంభం కానుండడంతో భక్తుల్లో ఆనందోత్సాహాలు పెల్లుబికుతున్నాయి. శ్రీరామచంద్రుడికి రకరకాల రూపాల్లో భక్తులు కానుకలు సమర్పించుకుంటున్నారు. తాజాగా బెంగళూరు పీణ్యాకు చెందిన ఇంజనీర్ సి. ప్రకాశ్ తాను కూడా ఓ ఉడతా భక్తి కానుకను సమర్పించుకోదలిచారు. ఇందులో భాగంగా రెండున్నర టన్నుల కార్బన్ స్టీల్‌తో 15 అడుగుల ఎత్తు, 7.5 అడుగుల వెడల్పు కల్గిన ఉడత విగ్రహాన్ని సిద్ధం చేశారు. అయోధ్యలో ఆధునికీకరించిన రైల్వే స్టేషన్‌లో దీన్ని ఈనెల 12న ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక ట్రక్కులో ఈ ఉడతను శనివారం ఉదయం అయోధ్యకు తరలించారు. 11 ఉదయానికల్లా అయోధ్యకు చేరుకుంటుందని ప్రకాశ్ మీడియాకు తెలిపారు. రామాయణంలో రామసేతు నిర్మాణంలో చిన్నచిన్న ప్రాణులు కూడా సేవలందించాయని, పురాణ కథలు కూడా ఉటంకిస్తున్నాయి. అందులో ఒక ఉడత కూడా సేవ చేయడంతో అదే నేటికీ ఉడతాభక్తిగా పేర్కొంటారు.

దుర్మార్గపు పాలనలో ఏపీ విచ్ఛిన్నం

- తెలుగుదేశం పార్టీ నేత కన్నా లక్ష్మీనారాయణ

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుర్మార్గపు పా లనలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విచ్ఛిన్నమైందని, రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగుదేశం అభిమానులందరిపైనా ఉందని ఆ పార్టీ సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ శనివారం బెంగళూరు టీడీపీ ఫోరం కార్యాలయానికి వచ్చారు. సత్తెనపల్లితోపాటు అనుబంధ నియోజకవర్గాలకు చెంది బెంగళూరులో నివసిస్తున్నవారు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ఐటీ, కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ తెలుగుదేశం ఫోరం పేరిట పదేళ్లపాటు మీరు అందిస్తున్న సేవలకు ఆనందం కలుగుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వవైభవం తీసుకురావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చారిత్రాత్మక అవసరమని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మనమే తీసుకుందామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో యువత సొంతూళ్లకు వెళ్లి ఓట్లు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు కనకమేడల వీర, శ్రీకాంత్ సోంపల్లి, లెనిన్ చౌదరి, విష్ణు నల్లూరి, రమేశ్ బొల్లినేని, శివ చినుమోలు, కేశవ్ కోకా, వెంకటరత్నం, విజయ్ రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ

ముగ్గురు డీసీఎంల కథనాలు


ఊహాగానాలే

- హోంశాఖ మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముగ్గురికి ఉపముఖ్యమంత్రి పదవులను సృష్టించాలన్న ప్రధాన డిమాండ్‌తో సీనియర్ మంత్రులు రహస్యంగా సమాలోచనలు జరిపారన్న కథనాలు కేవలం ఊహగానాలేనని హోంశాఖ మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్ స్పష్టం చేశారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సహచర మంత్రులైన మహదేవప్ప, సతీశ్ జార్కిహొళితో తాను జరిపిన సమావేశం కేవలం ఉభయకుశలోపరి కోసమేనని తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయాలు చర్చకు రాలేదన్నారు. మంత్రి రాజణ్ణ కూడా ఇదే అంశాన్ని పదే పదే ప్రస్తావిస్తున్న సంగతిని మీడియా ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఉపముఖ్యమంత్రి పదవుల విషయంలో తుది నిర్ణయం అధిష్ఠానం పెద్దలదే అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కోలారు నియోజకవర్గం నుంచి పోటీ చేయాల్సిందిగా తనను ఎవరూ కోరలేదని తెలిపారు. ఒకవేళ అధిష్ఠానం పెద్దలు సూచిస్తే ఆలోచిస్తానని అన్నారు. బెంగళూరు కస్తూర్బా రోడ్డులోని విశ్వేశ్వరయ్య మ్యూజియంను బాంబులతో పేల్చివేస్తామని ఇ-మెయిల్ రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారని వివరించారు. ముందు జాగ్రత్తగా మ్యూజియం వద్ద భద్రతను ఏర్పాటు చేశామన్నారు.

ఈ ఘనత ఇస్రో శాస్త్రవేత్తలదే : సీఎం

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సూర్యుడిపై అధ్యయనం చేసేందుకు ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్1 విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తద్వారా అంతరిక్ష పరిశోధనా రంగంలో ఇస్రో శాస్త్రవేత్తలు మరో మైలురాయిని సాధించారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశంసించారు. దీర్ఘకాలం అధ్యయనం చేసి అసాధారణ విజయాన్ని అందుకున్న ఇస్రో శాస్త్రవేత్తలను ఆయన పేరుపేరునా అభినందించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, కుమారస్వామి, సదానంద గౌడ కూడా ఇస్రో శాస్త్రవేత్తలను ప్రత్యేకంగా అభినందించారు. శనివారం వీరు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.03	1,623.42
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	8,438
సామర్థ్యం (టీఎంసీలు)	10.24	71.45

10న శ్రీ సిద్దరామేశ్వర జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, జనవరి 6 : ఈ నెల 10వ తేదీన శ్రీ సిద్ద రామేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించాలని సిరుగుప్ప తాలుకా తహసీల్దార్ విశ్వనాథ్, కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. జయంతి నిర్వహణపై తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ తాలుకా స్థాయి ప్రభుత్వాధికారులు, భోవి సమాజం వారు పాల్గొని సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన, వ్యవసాయాధికారి పాటిల్, తాలుకా సాంఘీకసంక్షేమ డైరెక్టర్ రాజేశ్వరి, భోవిసమాజం అధ్యక్షులు ఉలిగప్ప, కాలప్ప, నటరాజ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దడేసూగూరు ఉరుసు

సిరుగుప్ప, జనవరి 6 : సిరుగుప్ప తాలుకాలో ప్రసిద్ధి చెందిన దడేసూగూరు ఆలంబాషా ఉరుసు ఈ నెల 8,9,10 తేదీల్లో జరుగుతుందని దర్గాకమిటీ సభ్యులు తెలిపారు. 8వ తేదీ గంధం, 9వ తేదీ ఉరుసు, 10వ తేదీ జియారత్ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు, ఖవాలీ కార్యక్రమం జరుపుతున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, జనవరి 6 : గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కోరారు. కంప్లి పట్టణంలో 2021-22 సంవత్సరం నాటి రాష్ట్ర సఫాయి కర్మాచారి అభివృద్ధి నిగమ ఆధ్వర్యంలో ఎండీ క్యాంపులో రూ. 50 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలకు, మారుతీనగర్, సీపిరిదిన్నెలో రెండు చోట్ల భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు జరిపామన్నారు. అలాగే తమ నాయకుడు ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా ఇచ్చిన హామీలను ప్రజలకు అందిస్తూ ఎదురులేని నాయకుడిగా కొనసాగుతున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు గోపీనాథ్, రాజేష్, ఫ్రాంచీస్, గంగన్న, కాళింగ, ఉలిగప్ప, బాబు గురుప్రసాద్, సన్న మల్లప్ప, బసవరాజు, గంగరాజు, శీన, షణ్ముఖప్ప జాఫర్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు



ఈశ్వరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బళ్లారిరూరల్, జనవరి 6 : బళ్లారి నగరం బసవనకుంట 38వ వార్డు సమీపంలో వున్న ఈశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు గోవిందమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, ఉమాదేవి, పద్మావతి, వీణ, పద్మావతి, సుభాష్ ఆచార్య, పలువురు మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు.

నేడు ముత్యాలముగ్గుల పోటీలు

● చైతన్య కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి ● ఉదయం 9 గంటలకు ప్రారంభం

బళ్లారి గాంధీనగర్, జనవరి 6: ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన, సౌజన్యంతో ఆదివారం బళ్లారిలోని హవ్వంబావి వద్ద ఉండే శ్రీ చైతన్య బాలికల పియు కళాశాల ఆవరణలో జరగున్నాయి. బళ్లారిలో శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం సహకారంతో నిర్వహిస్తున్న ఈ ముత్యాల ముగ్గుల పోటీకి



ఏర్పాట్లలో పాల్గొన్న విద్యార్థినులు



ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించే మైదానం

ఏర్పాట్లు పూర్తయ్యాయి. మైదానంలో ముగ్గులు వేయడానికి అవసరమైన ఏర్పాట్లలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రాత్రి 7గంటల వరకు గళ్ళు వేయడంతో పాటు పోటీలో పాల్గొనే వారికి అనువైన స్థలం కేటాయించారు. శ్రీ చైతన్య కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయి. ముగ్గుల పోటీల్లో పాల్గొనే యువతులు, మహిళలు ముందుగానే శ్రీచైతన్య పీయూ కళాశాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ6వేలు, రెండో బహుమతిగా రూ 4వేలు, ద్వితీయ బహుమతిగా రూ 3వేలు పాఠశాల యాజమాన్యం అందజేయనుంది.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● మంత్రి నాగేంద్ర ● యువజనోత్సవాలు ప్రారంభం

బళ్లారి గాంధీనగర్, జనవరి 6: యువజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర యువజన క్రీడాశాఖామంత్రి బి. నాగేంద్ర తెలిపారు. క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా పాలనా మండలి, క్రీడాశాఖ సంయుక్తంగా నగరంలో రెండు రోజులపాటు నిర్వహించే రాష్ట్ర యువజన క్రీడోత్సవాలను శనివారం రాత్రి నగరంలో వాల్మీకి భవన్‌లో మంత్రి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్రముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ శాఖలో 2శాతం ఉద్యోగాలు రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అధునాతమైన రీతిలో క్రీడా వసతి నిలయాన్ని బళ్ళారిలో నిర్మించనున్నారు. ఫిబ్రవరి నెలలో బళ్ళారి ఉత్సవం నిర్వహించనున్నట్లు, బళ్ళారి ఉత్సవంలో ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాశాఖామంత్రి బి.నాగేంద్ర పట్టుబట్టి బళ్ళారిలో యువజనోత్సవాలు మొదటి సారిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి యువజనోత్సవ కార్యక్రమాలు బళ్ళారిలో నిర్వహించడం



డొల్లు వాయించి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్న మంత్రి బి.నాగేంద్ర

హర్షించదగ్గ విషయమన్నారు. జిల్లా సహాయాధికారి మహ్మమ్మద్ ఝుబేర్.ఎన్ అతిధులకు స్వాగతం పలుకగా, కార్యక్రమంలో ఉప మేయర్ బి.జానకి, బళ్ళారి సర్కిల్ ఐజిపి బి.ఎస్.లోకేష్ కుమార్, జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు, అసిస్టెంట్ కమీషనర్ హేమంత్.ఎన్, జిల్లా క్రీడాశాఖ అధికారి కె.గ్రేసి,పాలికె సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాళహస్తేంద్ర స్వామి ఆరాధన



కాళహస్తేంద్ర స్వామి ఆరాధన నిర్వహిస్తున్న దృశ్యం

కంప్లి, జనవరి 6 : జగద్గురు కాళహస్తేంద్ర స్వాముల 90వ వార్షికోత్సవ ఆరాధన మహోత్సవాలను కుడితిని పట్టణంలో విశ్వకర్మ సమాజం వారు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉదయం శనివారం ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి మహిళలు కళశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద వివిధ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి యేటా ఈ ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటామని తెలిపారు. అలాగే విశ్వకర్మ సమాజం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఇంట పిల్లలకు విద్యాభ్యాసం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కాశీ అనెగొంది సంస్థాన సరస్వతి పీఠం డీ హీరాశ్ స్వాములు శ్రీ కాళికాహస్తేంద్ర స్వాములు, జగదీష్ ఆచారి, హనుమేష్, నాగలింగ, వీరభద్రప్ప, మౌనేష్, బడిగేర్ మౌనేష్ ఆచారి, వీరేష్, కాళప్ప, బ్రహ్మయ్య, పత్తరు మౌనేష్, బాగలకోట ఈరన్న, నాగరాజు, గంగన్న, శ్రీనివాస్, ప్రవీణ్, రమేష్, మహిళలు, వివిధ మఠాధీశ్వరులు పాల్గొన్నారు.

నారాయణగౌడ అరెస్టుకు నిరసనగా కుడితినిలో రాస్తారోకో

కంప్లి, జనవరి 6 : రాష్ట్రంలో పరభాషకు బదులుగా రాష్ట్ర భాషకు సంబంధించిన నామఫలకాలు ఏర్పాటు చేయాలంటూ నిరసన చేస్తున్న రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు నారాయణగౌడను పోలీసులు అరెస్టు చేయడం ఎంతమాత్రం తగదంటూ కుడితిని రక్షణ వేదిక అధ్యక్షుడు భావి శివకుమార్ పేర్కొన్నారు. నారాయణగౌడ అరెస్టును ఖండిస్తూ కుడితినిలో హోస్పేట - బళ్లారి ఎస్ఎస్ రోడ్డుపై ఆయనను విడుదల చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భావి శివకుమార్ మాట్లాడుతూ తమ రాష్ట్ర భాష నామఫలకాలను ప్రతి షాపు ముందు ఏర్పాటు చేసుకునే విషయంపై నిరసన చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. వెంటనే నారాయణగౌడను విడుదల చేయాలని లేనిపక్షంలో భారీఎత్తున నిరసన చేపడతామని తెలిపారు. నాగలింగాచారి, జంగ్లి సాబ్, హనుమంతు, దివాకర్, శివ, పురుషోత్తమ, బాలప్ప, మున్నా, మంజునాయక్, భీమయ్యలు పాల్గొన్నారు.



కుడితినిలో నిరసన వ్యక్తం చేస్తున్న రక్షణ వేదిక పదాధికారులు

ఏపీఎంసీలో మురికి కుంటలను పూడ్చివేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బళ్లారి గాంధీనగర్, జనవరి 6: బళ్ళారి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఏపీఎంసి)లో కూరగాయల మార్కెట్ వెనుక, చేంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం ప్రక్కన ఉన్న మురికి కుంటలను అధికారులు మట్టితో పూడ్చి డ్రైనేజి నీటిని మళ్ళించారు. ఏపీఎంసి మురికినీటి పశువుల పాకగా మారిన వైనంపై డిసెంబరు 21వ తేదీన 'అపరిశుభ్రతకు చిరునామా బళ్లారి ఏపీఎంసి' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఏపీఎంసి సెక్రటరీ నంజుండ స్వామి స్పందించారు. పాత పోలీసు స్టేషన్ వెనుక ఉన్న మురికి కుంటలను మట్టితో పూడ్చివేసి శుభ్రం చేశారు.ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు ఏపీఎంసి పరిసరాలు శుభ్రం చేయంతో పాటు చెత్తాచెదారాలను తొలగించారు.బెంగళూరుకు చెందిన కేంద్ర వ్యవసాయ మార్కెట్ సమితి డైరెక్టర్ గంగాధర్ స్వామి ఆదివారం బళ్ళారి ఏపీఎంసి మార్కెట్‌ను సందర్శిస్తున్న నేపథ్యంలో చెత్తాచెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆంధ్రజ్యోతి కారణంగా మురికి గుంటలకు పట్టిన గ్రహణం వీడిందని వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలపై చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి



డీసీ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న డ్రైవర్లు

బళ్లారి సిటీ, జనవరి 06: రోడ్డుప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షలు జరిమానా విధిస్తూ కేంద్రప్రభుత్వం చేసిన చట్టసవరణ సరికాదని, శనివారం కర్ణాటక డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 లక్షల రూపాయల జరిమానా, 10సంవత్సరాల జైలు శిక్ష విధించే చట్టాన్ని అమలు చేస్తే డ్రైవర్లకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. నిరుపేద డ్రైవర్లను కరుణించి ఈ చట్టాన్ని రద్దు చేయాలని గతంలో అమలులో ఉన్న చట్టాలను కొనసాగించాలన్నారు.

లారీ యజమానుల సమ్మె విరమణ



లారీ యజమానుల సంఘంతో వాణిజ్య పరిశ్రమల మండలి చర్చల దృశ్యం

బళ్లారి సిటీ, జనవరి 06: స్పాంజ్ ఐరన్ రవాణా చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్, స్పాంజ్‌ఐరన్ అసోసియేషన్ అధికారుల మధ్య బళ్లారి జిల్లా వాణిజ్య, పరిశ్రమల సంఘం జోక్యం చేసుకుని పరస్పర చర్చల ద్వారా సమస్యను పరిష్కరించడంతో శనివారం వారు సమ్మెను విరమించుకున్నారు. రవాణా చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ బళ్లారి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు జనవరి 1నుంచి నిరసన చేపడుతున్నారు. బళ్లారి జిల్లా వాణిజ్య మండలి ఛైర్మన్ మహారుద్రగౌడ, ఉపాధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ జోక్యం చేసుకుని బళ్లారి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దన్న, స్పాంజ్ ఐరన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, లారీ ఓనర్స్ యజమానులతో కొత్త ఒప్పందం కుదిర్చారు. శనివారం నుంచి లారీ యజమానులు ఆందోళనను విరమిస్తున్నట్లు తెలిపారు.

కేఆర్‌పీపీ సిటీ అధ్యక్షుడిగా సాగర్ గౌడ



కేఆర్‌పీపీ సిటీ అధ్యక్షులు సాగర్‌గౌడ

బళ్లారిరూరల్, జనవరి 6 : కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ బళ్లారి సిటీ అధ్యక్షులుగా సాగర్‌గౌడను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు దమ్మూరు శేఖర్ తెలిపారు. కేఆర్‌పీపీ పార్టీ సంస్థాపకులు గాలి జనార్దన్ రెడ్డి, సతీమణి లక్ష్మీఅరుణ, జిల్లాఅధ్యక్షులు దమ్మూరు శేఖర్‌లు సాగర్‌గౌడకు నియామక పత్రం అందజేశారు. రాబోయే ఎన్నికలల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని సాగర్‌గౌడ తెలిపారు.

రూ.27వేల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న అధికారులు

బళ్లారిరూరల్, జనవరి 6 : తాలుకాలోని అలకుంది గ్రామ సమీపంలోని కార్మికుల వసతి గృహాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు ఆశారాణి నేతృత్వంలో ఒరిస్సాకు చెందిన సుశాంత్ అనే వ్యక్తి నుంచి రూ. 27 వేలు విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సుశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఈరణ్ణ పాల్గొన్నారు.

నేషనల్ అథ్లెటిక్స్‌కు ఇద్దరు క్రీడాకారుల ఎంపిక

కంప్లి, జనవరి 6 : గోవా పనాజిలో జరిగే 2024 సంవత్సరం 22వ నేషనల్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ క్రీడలకు జిల్లా నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. కంప్లి తాలుకా మావినళ్లి గ్రామానికి చెందిన బి రవి శంకర్, సిరుగుప్ప తాలుకా తక్కలకోట పట్టణానికి చెందిన బసవరాజులు ఎంపికయ్యారు. ఇరువురు బళ్లారి జిల్లా నుంచి అథ్లెటిక్స్ ఛాంపియన్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. జనవరి 9 నుంచి గోవా రాష్ట్రం పనాజీలో జీఎంసీ అథ్లెటిక్స్ క్రీడా ప్రాంగణంలో క్రీడలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో బి రవి శంకర్ 1500 మీటర్ల పరుగు పందెం, జావలిన్ త్రో క్రీడలకు ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే బసవరాజు జిగితక్ క్రీడలకు ఎన్నికైనట్లు తెలిపారు. డిసెంబరులో తుమకూరులో జరిగిన పారా అథ్లెటిక్ క్రీడల్లో గెలుపొంది నేషనల్ పారా అథ్లెటిక్ ఛాంపియన్ క్రీడలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.

హోసూరు జోన్

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ సత్య

హోసూరు, జనవరి 6: హోసూరు బుల్స్ జట్టు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలను హోసూరు అదియమాన్ కళాశాలలో హోసూరు మేయర్ సత్య ప్రారంభించారు. 45 ఏళ్ల పైబడిన వారు, 45 ఏళ్లలోపు వయస్సు వారికి రెండు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. చెన్నై, కోయంబత్తూరు, తూత్తుకుడి, జోలార్‌పేట, పొల్లాచ్చి, తిరుచ్చి, తమిళనాడుల్లోని అన్ని ప్రాంతాల నుంచి 50కి పైగా జట్లు పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. మొదటి, రెండవ రౌండ్ మ్యాచ్‌లు ఆడినందున పోటీలలో పాల్గొన్న క్రీడాకారులందరికీ ఏర్పాట్లు చేశారు. మ్యాచ్‌లను హోసూరు బుల్స్ జట్టుకు చెందిన వేలన్, తిరుపతి, గురరాజన్, ప్రేమ్, శేఖర్, ప్రభాకరన్, సత్యమూర్తి సన్నాహాలను నిర్వహించారు. ప్రముఖ అతిథులుగా అదియమాన్ కళాశాల ప్రిన్సిపాల్ రంగనాథ్, ఏఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ మణి, సోమనాథన్, నటరాజన్, భారతి, 17వ వార్డు పార్లమెంటు సభ్యుడు నాగరాజ్, 12వ వార్డు కౌన్సిలర్ బాలమురుగన్ హాజరయ్యారు.

ప్లాస్టిక్ వ్యర్థాలకు అడ్డుకట్ట వేయండి

హోసూరు(సిప్‌కాట్) జనవరి 6: వన్యప్రాణులకు ప్రమాదకరంగా మారుతున్న ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలను అటవీ ప్రాంతంలో వేయకుండా చర్యలు తీసుకోవాలని హోసూరు వన్యప్రాణి రక్షణ కార్యకర్తలు కోరుతున్నారు. కృష్ణగిరి జిల్లా మొత్తం వైశాల్యం 5143 కిమీ, కాగా హోసూరు అటవీ ప్రాంతం 1492 చదరపు కి.మీ వైశాల్యంతో జిల్లా అంతటా విస్తరించి ఉంది. ఇక్కడ ఉన్న పెద్ద, ముఖ్యమైన అటవీ జాతుల రక్షణను పరిగణనలోకి తీసుకుని, వాటిని రక్షించడానికి, 2014లో కావేరీ ఉత్తర వన్యప్రాణుల అభయారణ్యం, 2022లో కావేరీ సౌత్ వైల్డ్ లైఫ్‌గా ప్రకటించారు. ఈ అడవులలో పెద్ద సంఖ్యల్లో టేకు, ఈటె, చందనం, జాలరి (గంగూలియం) బోరాసు చెట్ల జాతులు, పెద్ద సంఖ్యలో ఏనుగులు, అటవి జంతువులు, లేళ్లు, చిరుత, పులులు, బూడిద ఉడుతలు, వంటి అరుదైన జంతువులు ఉన్నాయి. అలాగే కృష్ణగిరి జిల్లా కర్నాటక రాష్ట్రంలోని బన్నేరుఘట్ట నేషనల్ పార్క్, కావేరి వన్యప్రాణుల అభయారణ్యం నుంచి, ప్రతి సంవత్సరం అక్టోబరు నెలల్లో 125 నుంచి 150 ఏనుగులు హోసూరు, డెంకణీకోట అడవులకు వస్తాయి. ఇవి నొగనూరు, ఉడేదుర్గం, శానమావు, చెట్టిపల్లి, మహారాజగడ రిజర్వ్ ఫారెస్టల గుండా ఆంధ్ర ప్రదేశ్‌లోని గౌండన అభయారణ్యం, శ్రీ వెంకటేశ్వర అభయారణ్యం వరకు వెళ్లి ఏప్రిల్, మేలో మళ్లీ తిరిగి వస్తాయి. ఈ అటవీ ప్రాంతం గుండా కృష్ణగిరి బెంగళూరు జాతీయ రహదారి ఉండగా జాతీయ రహదారికి ఇరువైపులా అనవసర చెత్త, మాంసం వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తుంటారు. ఈ కారణంగా అనేక జంతువులు అంతరించిపోయే ప్రమాదం ఉంది. అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా ఉంది. అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను డంపింగ్ చేయడం, రవాణా చేయడంపై విధించాలి. నిఘా కెమెరాలు ఏర్పాటుచేయాలని కార్యకర్తలు కోరుతున్నారు,



అటవీ ప్రాంతంలో పేరుకున్న వ్యర్థాలు

మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకం



మాదక ద్రవ్యాలపై జాగృతి జాతాను ప్రారంభిస్తున్న డీసీ చంద్రశేఖర్ నాయక్

రాయచూరు జనవరి 6 : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల దుష్పరిణామాలే కాకుండా చివరకు ఆ అలవాటు ప్రాణాంతకంగా మారుతుందని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ అన్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని ముఖ్యంగా యువత ఇలాంటి వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అరిష్టాలు, సైబర్ నేరాల పై ప్రజలను చైతన్యం చేసేందుకు చేపట్టిన జాగృతి జాతాను శనివారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లాధికారి, మాదక ద్రవ్యాల వినియోగం ఇటీవల కాలంలో యువతపై చెడు ప్రభావాన్ని చూపిస్తున్నట్లు తెలిపారు. వీటికి బానిసలుగా మారుతున్న యువత నిర్వీర్యంగా మారి తమ జీవితాలను నాశనం చేసుకోవడమేగాక సమాజానికి సమస్యగా మారుతుండడం ఆందోళనకరమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ బి.నిఖిల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని ఇందుకు బాధ్యులైన వారి పై కఠినచర్యలు ఉంటాయన్నారు.

వీధి కుక్కల దాడిలో తల్లీకొడుకులకు గాయాలు

రాయచూరు జనవరి 6 : జిల్లాలోని సింధనూరు నగరంలో ఆస్పత్రికి వెళుతున్న తల్లీకొడుకులపై వీధి కుక్కలు దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. సింధనూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శరణరెడ్డి భార్య తన కుమారుడిని తీసుకుని చికిత్స కోసం ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. బాలుడి పై అకస్మాత్తుగా కుక్కలు దాడి చేయడంతో తన కుమారుడిని రక్షించుకునే ప్రయత్నంలో భాగంగా కుక్కలను అదిలించగా అవి ఆమెపై కూడా అవి దాడి చేశాయి. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కుక్కలను తరిమివేసి వారిద్దరిని ఆస్పత్రికి తరలించారు. ఇటీవల కాలంలో సింధనూరులో కుక్కలబెడద తీవ్రరూపం దాల్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మాంసందుకాణాల వద్ద పెద్దఎత్తున గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు దారిన పోయే వారిపై దాడులకు దిగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారిల పైనే ఈ పరిస్థితి ఉందని రోడ్డు పైకి రావాలంటేనే చిన్నపిల్లలు మహిళలు భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంట్...

ఇర్ఫాన్‌ఖాన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత ఇర్ఫాన్‌ఖాన్ 1967 జనవరి 7న రాజస్థాన్ రాష్ట్రం టోంక్‌లో జన్మించారు. హిందీ సినీ రంగంలో పేరొందిన నటుడు. బ్రిటీష్, అమెరికన్ సినిమాలలోనూ నటించారు. 30ఏళ్లలో నేషనల్ ఫిల్మ్ అవార్డ్, ఏసియన్ ఫిల్మ్ అవార్డ్, 4 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు పొందారు. ఆయన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ హిట్ సాధించాయి. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాతో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. రాజస్థాన్ రాష్ట్ర రాయబారిగా వ్యవహరించారు. 2020 ఏప్రిల్ 29న కన్నుమూశారు.

మల్లంపల్లి సోమశేఖర శర్మ (వర్ధంతి)



మల్లంపల్లి సోమశేఖరశర్మ 1891 డిసెంబరు 9న పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం మినిమించిలిపాడు గ్రామంలో జన్మించారు. సుప్రసిద్ధ తెలుగు చారిత్రక పరిశోధకుడు, పురాలిపి శాస్త్రజ్ఞుడు. నాటికీ నేటికీ ఆంధ్ర చరిత్రకారుల్లో అగ్ర తాంబూలానికి అర్హత సాధించిన పరిశోధక శిఖామణి. 'విజ్ఞాన సర్వస్వం' రూపకల్పనలో ఒకరు. పాత్రికేయుడిగా జీవితం ప్రారంభించారు. ఆయన కథలు, నాటకాలు, నవలలు, పద్యాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. సేకరించిన శాసనాలను విశ్లేషిస్తూ పలుపత్రికలలో వ్యాసాలు రాశారు. 1963 జనవరి 7న కన్నుమూశారు.

బాల్ ముండ్కుర్ (వర్ధంతి)



దేశంలో పేరొందిన ప్రకటనల విభాగం ఉల్కా సంస్థ సంస్థాపకులుగా బాల్ ముండ్కుర్ చిర పరిచితులు. దేశ ప్రకటనల విభాగంలో కీలకంగా వ్యవహరించారు. ఉల్కా ఏజెన్సీ సంస్థ దేశంలో మూడోస్థానంలో నిలిచింది. ముండ్కుర్ తొలుత నావల్ ఆఫీసర్, తర్వాత కమర్షియల్ ఎయిర్‌లైన్ పైలట్‌గా పేరొందారు. అనంతరం 1961లో ఉల్కాను స్థాపించి ప్రకటనల విభాగంలో సరికొత్త ఒరవడి సృష్టించారు. అనంతరం ఈ సంస్థ డ్రాఫ్ట్ ఎఫ్‌సీబీ ఉల్కాగా పేరు మారింది. ఏఏఏఐ అధ్యక్షుడిగా కొనసాగారు. 2012 జనవరి 7న గోవాలోని నివాసంలో కన్నుమూశారు.

బి. సరోజాదేవి (పుట్టినరోజు)



బహుభాషా నటి 'పద్మభూషణ్' గ్రహీత భైరప్ప సరోజాదేవి 1938 జనవరి 7న బెంగళూరులో జన్మించారు. తమిళ, కన్నడ, తెలుగు, హిందీ భాషలలో 180కుపైగా సినిమాలలో సినిమాలలో నటించారు. 1955లో 'మహాకవి కాళిదాస' కన్నడ సినిమాకు జాతీయ అవార్డు దక్కగా అందులో కేరక్టర్ నటిగా నటించారు. 1958లో 'నాడోడి మన్నన్' తమిళసినిమా ఎంజీఆర్‌తో నటించి పేరొందారు. తెలుగులో జగదేకవీరునికథ, దానవీరశూరకర్ణ వంటి సినిమాలలో నటించారు. పద్మశ్రీ, కళైమామణి, బెంగళూరు యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ తదితర పురస్కారాలు పొందారు.

శోభా డే (పుట్టినరోజు)



శోభా డే 1948 జనవరి 7న మహారాష్ట్రలోని ముంబైలో జన్మించారు. దేశంలో ప్రముఖ కాలమిస్ట్‌గా, నవలా రచయిత్రిగా పేరొందారు. పాత్రికేయ రంగంలో రాణిస్తూ స్టార్ డస్ట్, సొసైటీ, సెలబ్రిటీ పత్రికలకు ఫౌండర్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ది టైమ్స్ ఆఫ్ ఇండియా, ఏషియన్ ఏజ్ వంటి పత్రికలలో వీక్లీ కాలమ్స్ నిర్వహించారు. బుల్లితెర సీరియల్ 'స్వాభిమాన్'కు రచయితగా ఉన్నారు. ప్రముఖ దినపత్రికలు, మ్యాగజైన్‌లకు ఫ్రీలాన్స్ రైటర్‌గా కొనసాగుతున్నారు.

భాగ్యరాజ్ (పుట్టినరోజు)



క్రిష్ణసామి భాగ్యరాజ్ 1953 జనవరి 7న తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో జన్మించారు. దర్శకుడు, నటుడు, స్క్రీన్‌రైటర్, సంగీత దర్శకుడు, నిర్మాత ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు, హిందీ సినిమాలు, టీవీ సీరియల్స్‌కు రచన దర్శకత్వం వహించినా ప్రత్యేకించి తమిళంలో పేరొందారు. 75కుపైగా సినిమాలలో నటించగా 25కుపైగా సినిమాలకు దర్శకత్వం వహించారు. 'భాగ్య' వారపత్రికకు సంపాదకులు. 2014 సైమా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, తమిళనాడు ప్రభుత్వం తరఫున ఉత్తమ నటుడు పురస్కారంతోపాటు పలు అవార్డులు పొందారు.

దేవెగౌడతో బీజేపీ నేత సోమణ్ణ భేటీ



దేవేగౌడను సత్కరిస్తున్న సోమణ్ణ, చిత్రంలో కుమారస్వామి

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడను బీజేపీ నేత, మాజీ మంత్రి సోమణ్ణ కలిశారు. శుక్రవారం పద్మనాభనగర్‌లోని దేవేగౌడ నివాసానికి వెళ్ళిన సోమణ్ణను మాజీ సీఎం కుమారస్వామి సాదరంగా స్వాగతించారు. సుమారు రెండుగంటలకు పైగా దేవేగౌడ, కుమారస్వామిలతో చర్చలు జరిపారు. శాసనసభ ఎన్నికలలో రెండుచోట్ల పోటీ చేసి ఓటమి చెందిన తర్వాత సోమణ్ణ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో మరింత ఆవేదనలో ఉండే సోమణ్ణ ఏకంగా పార్టీకు గుడ్‌బై చెప్పే ప్రయత్నమూ చేశారు. కానీ ఐదురాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర బీజేపీ నేతలతో ఏమాత్రం సఖ్యంగా లేని సోమణ్ణ ఒక్కసారిగా దేవేగౌడ నివాసానికి వెళ్ళి చర్చలు జరుపడం సర్వత్రా చర్చలకు కారణమవుతోంది. ఇదే విషయమై సోమణ్ణ మీడియాతో మాట్లాడుతూ 1976లో బెంగళూరుకు జీవనం సాగించేందుకు వచ్చిన వేళ దేవేగౌడను కలిశానన్నారు. జనతా పరివార్‌లో కలిసి పని చేశామని 30 ఏళ్ళపాటు దేవేగౌడ శిష్యుడిగా కొనసాగానన్నారు. నేను ఇటీవల గందరగోళంగా ఉన్న నేపథ్యంలోనే దేవే గౌడను కలిసి రాజకీయ అంశాలపై చర్చలు జరిపానన్నారు. నేను పడిన ఇబ్బందులు వివరించానన్నారు. దేవేగౌడ ధైర్యం చెప్పారని అన్నీ సర్దుకుంటాయని భరోసా ఇచ్చారన్నారు.

ప్రజల రక్షణకు కట్టుబడి ఉన్నాం: కేంద్ర మంత్రి



పుస్తకావిష్కరణలో కేంద్రమంత్రి జైశంకర్, పీఈఎస్ చాన్స్‌లర్ దొరస్వామి తదితరులు

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో సొరంగ మార్గం కూలిన ప్రమాదమైన ఉక్రెయిన్ యుద్ధ వాతావరణం నెలకొన్న సందర్భమైనా, సమస్యల్లో చిక్కుకున్న ప్రజలను రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరంగా కట్టుబడి ఉందని కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీ గోల్డెన్ జుబ్లీ ఉత్సవాలు నాలుగు రోజుల చర్చాగోష్టిలో భాగంగా తాను రచించిన వై భారత్ మ్యాటర్స్ పుస్తకాన్ని ఆవిష్కరించి బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్యతో కలసి చర్చాగోష్టి జరిపారు. మా ప్రభుత్వం కొవిడ్ క్లిష్ట సమయంలో ఉక్రెయిన్‌లో యుద్ధమే కాకుండా ఉత్తరాఖండ్‌లో సొరంగమార్గం కూలిన ప్రమాదంలో కార్మికులు చిక్కుకున్న వేళ సామర్థ్యానికి మించి చర్యలు చేపట్టడం ద్వారా వేలాదిమంది ప్రాణాలు కాపాడామన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు క్లిష్ట సమయంలో ఏ విధంగా ఆదుకోవాలని భావించారో అందుకు అనుగుణంగానే వ్యవహరించామన్నారు. విదేశీయుల చొరబాట్లపై ఓ విద్యార్థి ప్రశ్నకు సమాధానంగా మీ ఇంటి తలుపులు తెరిచారని ఎవరైనా అతిక్రమిస్తే చూస్తూ మౌనంగా ఉంటారా..? అంటూ ఎదురు ప్రశ్నించారు. అదే కేంద్రప్రభుత్వం కూడా పాటిస్తుందన్నారు. పొరుగుదేశాలతో స్నేహాన్ని కోరుతామని అతిక్రమణలు ఎప్పటికీ సహించేది లేదన్నారు. దేశంలో రిజర్వేషన్ తొలగింపు మరెంతకాలమని ఓ విద్యార్థి ప్రశ్నకు సమాధానం చెప్పకుండా దాటవేశారు. కార్యక్రమంలో పీఈఎస్ వ్యవస్థాపకులు, యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దొరస్వామి, ప్రొ-చాన్స్‌లర్ జవహర్ తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయవాది, ప్రముఖ రచయిత సాయిదీపక్ జైకుమార్, ఇంక్ ఫౌండర్ సీఈఓ లక్ష్మీ ప్రాటరీ తదితరులు భాగస్వామ్యులయ్యారు.

క్రీడలకు తగిన ప్రోత్సాహం : మంత్రి



క్రీడాకారులతో మంత్రి కేహెచ్ మునియప్ప

శిడ్లఘట్ట, జనవరి 6: గ్రామీణ ప్రాంతాలలో క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా యువతను ఆదుకోవాలని పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప తెలిపారు. తాలూకాలోని భక్తరహళ్ళిలో జై భీమ్ బాయ్స్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీ వెంకటరాయప్ప జ్ఞాపకార్థం ఏర్పాటైన తాలూకా స్థాయి వాలీబాల్ పోటీలను ఉద్దేశించి మాట్లాడారు. విరూపాక్షప్ప నిర్మించిన హైస్కూల్‌లో తాను వాలీబాల్ క్రీడాకారుడిగా ఆడిన ఆట గుర్తుకొస్తోందన్నారు. అవిభాజ్య జిల్లాలో శిడ్లఘట్ట నుంచి జంగమకోటె ప్రాంత యువకులు అధిక శాతం క్రీడాకారులుగా ఎంపికయ్యారన్నారు. అదే రీతిన జంగమకోటె, శిడ్లఘట్ట జట్ల మధ్య ఆట ఉత్తమ ప్రదర్శన ఆకట్టుకుంది. రాజీవ్‌గౌడ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ గెలవాలని, రాహుల్‌గాంధీ లేదా మల్లికార్జున ఖర్గేలలో ఒకరు ప్రధానమంత్రి అవుతారన్నారు. రానున్న నాలుగు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నాలుగు పంచాయతీలు కాంగ్రెస్ గెలవాలని ఆకాంక్షించారన్నారు. క్రీడాకారులకు తాము తనవంతు అండగా ఉంటామని, రాష్ట్ర, జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు. యువస్టార్ విశ్వనాథ్ బృందం ఉత్తమంగా ప్రతిభ చాటింది. చిక్కబళ్ళాపుర తాలూకా ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, హాప్‌కామ్స్ అధ్యక్షుడు బీవీ మునేగౌడ, కేఎంఎఫ్ డైరెక్టర్ ఆర్ శ్రీనివాస్, మేలూరు మంజునాథ్, రాజీవ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



రుణాల చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, జనవరి 6: వ్యవసాయ ఉద్దేశ్యాలకు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా వడ్డీ మాఫీ పథకం ప్రయోజనం పొందాలని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పీఎల్‌డీ బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో బ్యాంకు ద్వారా అర్హులైన రైతులకు రుణాల చెక్కులను అందచేశారు. ఇటీవల బెళగావిలో జరిగిన శాసనసభ శీతాకాల సమావేశాలలో సీఎం తమ ప్రసంగంలో రైతులు పూర్తి రుణాన్ని చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని ప్రకటించారన్నారు. రైతుల సంక్షేమం కోసం సీఎం సిద్దరామయ్య ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రైతులు లేదా ఎవరైనాగాని బ్యాంకు నుంచి పొందిన రుణాలను ఆయా ఉద్దేశ్యాల లక్ష్యం అందువాలని, ఆర్థిక క్రమశిక్షణ పాటించి సకాలంలో రుణాలను వాపసు చేయాలన్నారు. గత నెల రూ.2.4 కోట్లరుణాలను 60మంది రైతులు పొందారని ప్రస్తుతం కేవలం 3శాతం వడ్డీతో 14మంది రైతులకు రూ.33 లక్షల వ్యవసాయ రుణాలు అందచేశామన్నారు. పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు డీసీ రామచంద్ర మాట్లాడుతూ రైతులు తాము పొందిన రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా బ్యాంకు ఆర్థికతకు సహకరించాలన్నారు. అప్పుడే బ్యాంకు ద్వారా ఇతర రైతులకు ప్రయోజనం సాధ్యమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ బంక్ మునియప్ప, సురేశ్, మేనేజర్ సీఎల్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై జాగృతి



జాగృతిలో విద్యార్థులు తదితరులు

హెబ్బాళ్, జనవరి 6: నియోజకవర్గంలోని ఆర్‌టీ నగర్ 108 బీ సర్కిల్‌లో ట్రాఫిక్ నియమాలపై శనివారం ప్రత్యేక జాగృతి చేపట్టారు. కెన్‌శ్రీ పాఠశాల విద్యార్థులు వివిధ నృత్యాలు, నాటక ప్రదర్శనలతో చైతన్య కార్యక్రమాలు కొనసాగాయి. ఎస్ఐ శివప్రసాద్, ఆర్‌టీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, కెన్‌శ్రీ స్కూల్ సురేశ్, పాఠశాల పాలకవర్గమండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండే అవకాశం ఉందన్నారు. ర్యాలీ అనంతరం విద్యార్థులకు బిస్కట్, చాకొలెట్ ఇతరత్రా పానీయాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించి , బ్యానర్లు చేతబూని నినాదాలు చేశారు.

డ్రగ్స్‌కు బానిస కావద్దు

» నటి పూజాగాంధీ



వాకథాన్‌లో నటి పూజాగాంధీ

దొడ్డబళ్ళాపుర, జనవరి 6: డ్రగ్స్ వ్యసనాలకు బానిస కావద్దని ప్రముఖ సినీ నటి పూజాగాంధీ తెలిపారు. పట్టణంలోని భగత్‌సింగ్ క్రీడా మైదానంలో బెంగళూరు గ్రామీణ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో దొడ్డబళ్లాపుర ఉపవిభాగ పరిధిలోని పోలీస్ స్టేషన్లు, పాఠశాల, కళాశాలల సహకారంతో మాదకద్రవ్యాలతో దుష్పరిణాలు, నియంత్రణపై వాకథాన్ చేపట్టారు. బెంగళూరు గ్రామీణ జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి, ప్రఖ్యాత నటి పూజాగాంధీ, నటుడు గురునందన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజాగాంధీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం ద్వారా బలి కాకూడదని పేర్కొన్నారు. నటుడు గురునందన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఒత్తిడి ఉన్నప్పుడు యోగా చేయడం, లేదా సంగీతాన్ని ఆలకించడం, సినిమా చూడడం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందన్నారు. ఏఎస్పీలు పురుషోత్తమ, నాగరాజ్, డీఎస్పీ రవి, పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అమరేశ్‌గౌడ, రూరల్ ఇన్‌స్పెక్టర్ మునికృష్ణ, బెంగళూరు రూరల్ అధికారులు, తాలూకా పంచాయతీ, ఈఓ రంగప్ప, నగరసభ కమిషనర్ పరమేశ్వర్, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ పరేడ్‌కు.. బ్రాండ్ బెంగళూరు శకటం

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న చారిత్రాత్మక గణతంత్ర దినోత్సవాలలో బ్రాండ్ బెంగళూరు వైభవాన్ని చాటిచెప్పే ప్రత్యేక శకటాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందుకు ఎంపిక కమిటీ ఇప్పటికే పచ్చజెండా చూపింది. దీంతో సమాచారశాఖ ఆకర్షణీయమైన హంగులతో బ్రాండ్ బెంగళూరు శకటాన్ని తీర్చిదిద్దే పనిలో పడ్డారు. అయితే ఇది ప్రధాన పరేడ్‌లో ఉంటుందా..? లేదా అనే అంశంపై ఇంకా స్పష్టత లేదని ఇంకా అధికారులు అంటున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ, గణతంత్ర దినోత్సవాలలో పరేడ్‌లో పాల్గొనే శకటాలకు వంతుల వారీగా రాష్ట్రాలకు అవకాశం కల్పిస్తున్నారు. ఒకవేళ ప్రధాన ప్రదర్శనలో అవకాశం లభించకపోతే కనీసం ప్రత్యేక ప్రదర్శనలోనైనా అనుమతి ఇవ్వాలని కోరనున్నారు.

21న కేన్సర్ సొసైటీ సర్వసభ్య సమావేశం

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక కేన్సర్ సొసైటీ 2022-23 వార్షిక సర్వసభ్య సమావేశం ఈనెల 21న ఉదయం 11.30 గంటలకు సొసైటీ ఆవరణలో అధ్యక్షుడు హెచ్‌వీ సురేశ్ సారథ్యంలో జరగనుంది. ఈమేరకు సొసైటీ గౌరవ కార్యదర్శి కేసీ నీలకంఠ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నామని 53వ వార్షిక సర్వసభ్య సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

13న చిక్కబళ్లాపురలో మెగా ఉద్యోగమేళా



మీడియాతో రక్షా రామయ్య తదితరులు

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈనెల 13న జిల్లా కేంద్రమైన చిక్కబళ్ళాపురలో భారీ ఉద్యోగ మేళా, రుణ మేళా జరగనుందని, 70కుపైగా కంపెనీలు పాల్గొంటాయని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షా రామయ్య వెల్లడించారు. చిక్కబళ్ళాపురలో శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగమేళాతోపాటు విద్యా రుణాలు, స్టార్టప్ సంస్థలకు రుణసదుపాయం లభించనుందన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ యువతను ప్రోత్సహిస్తోందన్నారు. గణాంకాల ప్రకారం 2019లో దేశంలో నిరుద్యోగ ప్రమాణం 7.7శాతంగా ఉండేదని, 45ఏళ్లలో ఇది అత్యధికమన్నారు. 2023 నవంబరులో ఇది 10.05శాతానికి పెరిగిందన్నారు. కాగా ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రస్తుతం బీజేపీ పాలనలోని హర్యానాలో 37.4శాతం నిరుద్యోగ ప్రమాణం ఉందన్నారు. ఈ తరుణంలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను నివారించేందుకు తమ వంతుగా మేళా చేపట్టదలిచామన్నారు. చిక్కబళ్ళాపుర జిల్లాలో ప్రధానంగా వ్యవసాయం, పాలడైరీలే అధికమన్నారు. మేళాలో 70కుపైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 5 ప్రముఖ బ్యాంకులు రుణసౌలభ్యం కల్పించేందుకు ముందుకొస్తున్నాయన్నారు. విద్య, నైపుణ్యం ఆధారంగా రూ.16వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్ష దాకా వేతనం లభించే అవకాశం ఉందన్నారు. హోండా మోటార్స్, వివా మోటర్స్, అపోలో హోం కేర్, రిలయెన్స్ రిటైల్, మోటరోలా, జస్ట్ డయల్ లిమిటెడ్, మోతిలాల్, ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, హిందుజా గ్లోబల్ సొల్యూషన్స్, విస్ట్రాన్ ఇన్ఫోకామ్, రాయల్ మార్ట్, టాటా విస్ట్రాన్, బిగ్‌బాస్కెట్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ముత్తూట్ తదితర బ్యాంకులు పాల్గొంటున్నాయన్నారు.

రాఘవేంద్రస్వామికి దీపస్తంభాల బహూకరణ



పూజల నిర్వహణ

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జయ నగర్ లే అవుట్‌లోని నంజనగూడు రాఘవేంద్ర స్వామి మఠానికి భక్తులు దీపస్తంభాలను కానుకగా అందజేశారు. మఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామిజీ సూచన మేరకు ప్రత్యేక పూజలు, అన్నదానం, రథోత్సవం, పల్లకి ఉత్సవం, గజవాహనోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయం సీనియర్ మేనేజర్ ఆర్‌కే వాదీంద్రచార్ మీడియాకు చెప్పారు. ఇదే సందర్భంగా ఏర్పాటైన నివేదిత స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థుల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు.